11

# పెంతెకొస్తు మరియు తరువాత విషయాలు

## (అపొస్తులుల కార్యములు 2)

అపొస్తులుల కార్యములు 2వ అధ్యాయములో వివరించబడిన పెంతెకొస్తు పండుగ యేసు మరణం (పస్కా పండుగ) నుండి సరిగ్గా యాభై రోజుల తర్వాత చోటు చేసుకుంది. అంటే ఆయన పరమునకు ఆరోహణమైన నాటనుండి సరిగ్గా పది రోజులకు. నిజానికి పెంతెకొస్తు అనేది గోధుమల పంటనుండి ప్రథమపంట యొక్క పండుగ. కానీ తరువాత కాలంలో ఇది సీనాయి పర్వతం మీద ధర్మశాస్త్రం ఇయ్యబడుటకు జత చేయబడింది (ఎట్లా ఎందుకు ఎలాగో ఎవరికీ తెలియదు). దేవుడు మరియు ఇశ్రాయేలు మధ్య నిబంధనను పునరుద్ధరించే సందర్భముగా ఇది మారింది. క్రైస్తవ్యం యొక్క పుట్టుక మరియు దాని అభివృద్ధిలో అపొస్తులుల కార్యములు 2 అధ్యాయం ఎంతో ముఖ్య పాత్ర పోషించింది. ఎంతగా అంటే, వాక్య ప్రత్యక్షతలో అపొస్తులుల కార్యములు 2వ అధ్యాయం ప్రధాన వాక్యముగా కనబడుతుంది.

ప్రత్యేకించి ఈ పెంతెకొస్తు పండుగే ఎందుకు ప్రాముఖ్యమైంది? “పెంతెకొస్తు దినం” దేనిని గురించినది?

ఈ ప్రశ్నలకు రెండు సమాధానములను ఇవ్వవచ్చు.మొదటిది, పెంతెకొస్తు అనగా, పరిశుద్ధాత్ముని ఆగమనం మరియు భాషలతో మాట్లాడటమనే వరము ఇయ్యబడడం అని కొంతమంది చెపుతారు. పెంతెకొస్తు పండుగ అనేది అన్యభాషలతో మాట్లాడడం అనే వరముతో ఎంతగానో సంబంధం కలిగియుంది. అందుకే దీనిని నమ్మువారు ఈ నాడు “పెంతెకొస్తు వారు” అని పిలువబడుతున్నారు. అలాగే వారి ఉద్యమం “పెంతెకొస్తు ఉద్యమం” అని పిలువబడ్తుంది.

అపొస్తులుల కార్యములు 2వ అధ్యాయంలోని పెంతెకొస్తు దినం యొక్క ప్రాముఖ్యతకు గల మరోకారణం “సంఘం స్థాపన.” ఆ దినమున సంఘం అధికారికంగా ఉనికిలోకి వచ్చింది.

అపొస్తులుల కార్యములు 2ను చదువుతుండగా ఈ రెండు విషయాలు ప్రాముఖ్యం అని మనకు తోస్తుంది. కానీ, ఈ అధ్యాయం యొక్క ప్రాథమిక దృష్టి ఈ రెండు విషయాలపై లేదు. నిజానికి యేసును గురించి మరియు ఆయన చెప్పిన రక్షణను గురించే ఈ అపొస్తులుల కార్యం 2 అధ్యాయం ప్రాథమికంగా దృష్టిస్తుంది. పెంతెకొస్తు పండుగ అనేది ఇక్కడ ఎంతో ప్రాముఖ్యమైంది ఎందుకంటే, ఈ దినాన మొట్టమొదటిసారిగా యేసును గురించిన సంపూర్ణ సువార్త పూర్తిగా ప్రకటించబడింది. యేసు చనిపోయేంతవరకు, పునరుత్థానుడయ్యేంత వరకు, తండ్రియొద్దకు తిరిగి ఆరోహణమయ్యేంత వరకు “సంపూర్ణ సువార్త” ప్రకటింపబడడం. ఇది మొదటిసారిగా అపొస్తులుల కార్యములు 2వ అధ్యాయంలో జరిగింది.

పరిశుద్ధాత్ముని ఆగమనం మరియు సంఘం స్థాపించబడడం అనేవి యేసుని సువార్త ప్రకటనతో ముడిపడియున్నాయి. యేసుని ప్రకటనకు కావల్సినంత శక్తిని పరిశుద్ధాత్ముని రాక

చేకూర్చగా, ఆ ప్రకటన ఫలితంగా సంఘం స్థాపించబడింది. కాబట్టి అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయం మరియు పెంతెకొస్తు ఘటనలోనూ సువార్త సందేశమే ప్రాథమికమైన అంశం.

## సువార్త ప్రకటనకు శక్తి: పరిశుద్ధాత్ముని ఆగమనం (2:1-21)

యేసు పరమునకు ఆరోహణమగుటకు ముందు "... కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరు" అని తన శిష్యులకు వాగ్దానం చేశాడు (అపొస్తలుల కార్యములు 1:5). అలాగే, "పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును, నాకు సాక్షులైయుందురని" అని వారికి చెప్పాడు (1:8). పునరుత్థానుడైన యేసును ప్రకటించుట అపొస్తలులకు శక్తి కావాలి. ఆ శక్తి పరిశుద్ధాత్మయందలి "బాప్తిస్మం" (అంటే, "ఆవరించబడడం" లేదా "ముంచబడడం" అని అర్థం. ఇది అలంకార రీతిలో చెప్పబడింది) పొందడం ద్వారా వారికి కలుగుతుంది.

ఇది జరిగిన విధానం అపొస్తలుల కార్యములు 2:1-13లో వివరించబడింది. అపొస్తలులందరు ఒక ఇంటిలో కూర్చునియుండగా, వేగముగా వీచు బలమైన గాలివంటి ధ్వని వినబడింది. అలాగే "అగ్నిజ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా" వారికి కనబడి (3 వచనం). దాదాపు ప్రతి అపొస్తలుని తలమీద కనబడ్డాయి. అప్పుడు వారు "పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి" (4 వచనం). ఈ సమావేశ సందర్భంగా, ఒక పెద్ద గుంపు కూడి వచ్చారు. అప్పుడు అపొస్తలులు బయటకు రాగా, ఏం జరిగిందో ప్రజలు అర్థంచేసుకున్నారు. అప్పుడు పేతురు లేచి ప్రసంగించాడు. తరువాత ప్రజలలో ఒక రకమైన గందరగోళం నెలకొనింది. అపొస్తలులందరూ, సామాన్య గలిలయులైనను, వారు తమ భాషలతో మాట్లాడసాగారు. పస్కాను మరియు పెంతెకొస్తు పండుగను జరుపుకొనుటకు యూదులు మరియు యూదా మతము పుచ్చుకున్న ఇతరులు అనేక దేశములనుండి వచ్చారని ఆ దేశముల, జాతుల వివరాలను గ్రంథకర్త లూకా అందిస్తున్నాడు. అక్కడున్న వారు అపొస్తలుల మాటలు విని "వీరు మన భాషలతో దేవుని గొప్పకార్యములను వివరించుట వినుచున్నామని" (అపొస్తలుల కార్యములు 2:11) వారు అనుకున్నారు. జరుగుతున్న సంఘటనను చూచి అక్కడివారు చర్చించుకుంటూ, ఆఖరికి వారు మత్తులైయున్నారని ముక్తాయింపుకొచ్చారు.

దీనినంతా మనం ఎలా వ్యాఖ్యానించవచ్చు? మొదటిగా, అన్యభాషలతో మాట్లాడడం అనే వరమును కుమ్మరించుటకు పరిశుద్ధాత్ముడు రాలేదన్న విషయమును గుర్తించుకోవాలి. పరిశుద్ధాత్ముని ఆగమనమునకు గుర్తుగా, అదనంగా రెండు సూచనలు (గాలి మరియు "అగ్ని నాలుకలు వలె విభాగింపబడడం"[1]) వెంబడించాయని 2 మరియు 3 వచనాల్లో చూస్తున్నాము. అన్య భాషలతో మాట్లాడు వరమును ప్రత్యేకంగా చూపించి చెప్పనవసరం లేదు. రెండవదిగా, అన్యభాషలతో మాట్లాడడం అనేది పరిశుద్ధాత్ముని ఉనికికి గురుతు, కానీ ముగింపు కాదు. అపొస్తలులు అన్యభాషలతో మాట్లాడడమును గురించి జనములు తప్పుగా అర్థంచేసుకోకుండా ఉండునట్లు పేతురు దానికి వివరణనిచ్చాడు. యోవేలు ప్రవచనమును గురించి (యోవేలు 2:28-32) దాని నెరవేర్పును గురించి పేతురు చెప్పేంత వరకు ప్రజలు తాము చూస్తున్నది, వింటున్నది ఏమిటో అర్థం చేసుకోలేకపోయారు. అపొస్తలులు అన్యభాషలతో మాట్లాడడం

అనేది మరింత ప్రాముఖ్య విషయమును సూచిస్తుంది.

ఆత్మ యొక్క కుమ్మరింపు అనేది ప్రాథమికంగా అన్యభాషలతో మాట్లాడడమును గురించి కాకపోతే మరి ఇది దేని గురించి తెలియజేస్తుంది? *మొదటిగా, యేసు పునరుత్థానమును గురించి అపొస్తలులు సాక్ష్యమిచ్చేలా వారిని బలపరచడానికి పరిశుద్ధాత్ముడు అనుగ్రహింపబడ్డాడు.* సువార్తల చివరి భాగంలో తాము ఎలా సాక్షమియ్యాలో అర్థంకాని పరిస్థితిలో అపొస్తలులు ఉన్నారు (లూకా 24:19–21; అపొస్తలుల కార్యములు 1:6, 7). ఆఖరికి పునరుత్థానంతరం యేసు వారికి కనబడిన ప్రత్యక్షతలు వారి పనిని గురించిన స్పష్టతనియ్యలేదు అలాగే దానిని ఎలా చేయాలన్న శక్తి కూడా వారికి లభించలేదు. కానీ పరిశుద్ధాత్మ వచ్చినప్పుడు వారిని "సర్వసత్యములోనికి నడిపించును" మరియు "సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13) అని యేసు వారికి వాగ్దానం చేశాడు. పెంతెకొస్తు దినాన, పరిశుద్ధాత్మ వారిమీదికి దిగివచ్చినప్పుడు యేసు సిలువవేయబడి, మరియు లేపబడ్డాడని ప్రకటించుటకు అపొస్తలులు శక్తిని పొందారు. ఇటువంటి ధైర్యమును వారింతకు ముందు ఎరిగియుండలేదు. ఇది సహజ వివరణకు అతీతమైంది (ఇది పేతురు ధైర్యారోపణ లలో విదితమైనది 2:36).

*రెండవదిగా, ఇశ్రాయేలు పునరుద్ధరణలో సహాయం చేయుటకు ఆత్మ అనుగ్రహింప బడింది.* పెంతెకొస్తు దృశ్యమును వివరిస్తూ ప్రవక్త యోవేలు మాటలను పేతురు 16 నుండి 21 వచనాలలో పేర్కొంటున్నాడు. ఈ వాక్యం యొక్క పూర్తి వివరాలు, దీని నేపథ్యం కొరకు మనం యోవేలు గ్రంథమును చదువవలసిందే. అనైతిక పరిస్థితుల్లోనున్న ఓటమి చెందిన ఇశ్రాయేలునకు ప్రవచనమును అంధిస్తూ, వారి పట్ల దేవుని పని ఇంకనూ అయిపోలేదని వాగ్దానం చేస్తున్నాడు. భవిష్యత్తులో వారికి పునరుద్ధరణ రోజు రానైయున్నదని యోవేలు ప్రకటిస్తున్నాడు. పరిశుద్ధాత్ముని రాకతో, ఆయన "సమస్తమునకు" అందుబాటులోనున్నప్పుడు "ఆఖరి దినములలో" (అపొస్తలుల కార్యములు 2:17; యోవేలు 2:28లో "తరువాత" అని వ్రాయబడింది) పునరుద్ధరణ జరుగుతుంది.

పునరుద్ధరణ సమయం గురించి తన ప్రవచనమును యోవేలు తెలియజేస్తున్నాడు. నిబంధనల మధ్యకాలం (పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య కాలం) నుండి అసలైన ప్రవచనం ఆగిపోయిందని యూదా మతం బలంగా విశ్వసించింది. మెస్సీయ రాకతో మరియు పరిశుద్ధాత్ముని కుమ్మరింపుతో అది తిరిగి ఆరంభించబడుతుందని వారు నమ్మేవారు. పాత నిబంధనలో పరిశుద్ధాత్ముని వరం అనేది కేవలం ఒక అవకాశం మాత్రమే, అది తప్పనిసరి కాదు. ఈనాడు ప్రతి క్రైస్తవుడు పరిశుద్ధాత్ముని పొందియున్నట్లుగా ఆనాడు ఇశ్రాయేలీయులందరూ ఆత్మను పొంది యుండేవారు కాదు. రాజులు, ప్రవక్తలు, న్యాయాధిపతులను వారి పనులలో బలపర్చుటకు పరిశుద్ధాత్ముడు "ఆవరించియుండేవాడు." పరిశుద్ధాత్మ వరమును యోవేలు అందరికీ వాగ్దానం చేశాడు. ఆ కాలం వచ్చియున్నదని పేతురు ప్రకటించాడు. దేవుడు నూతన కార్యమును జరిగిస్తున్నాడు. ఈ పునరుద్ధరణ అనేది "భౌతిక ఇశ్రాయేలునకు" కాదు గాని, "ఆత్మీయ ఇశ్రాయేలునకు" అని అపొస్తలుల కార్యములు 2:39 తెలియజేస్తుంది. ఈ ఆత్మీయ ఇశ్రాయేలులో యూదులతో పాటు అన్యులూ భాగస్వాములే. "దూరస్థులందరూ" అంటే, దేవునికి దూరంగానున్న అన్యులు అని అర్థం (చూడు ఎఫెసీయులకు 2:12, 13).

అపొస్తలుల కార్యములు 2లో పరిశుద్ధాత్ముని కుమ్మరింపు ఎంత ప్రాధాన్యమో, అలాగే

పెంతెకొస్తు కథ అంతటితో ఆగిపోలేదు. పరిశుద్ధాత్ముని ఆగమనం ప్రజలందరి దృష్టిని ఆకర్షించగానే, జరుగుతున్న సంఘటనలను పేతురు వారికి వివరించాడు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని, యేసును ఆయన తెచ్చిన రక్షణను పేతురు ప్రకటించాడు.

### సువార్త ప్రకటణ: యేసుని గురించి పేతురు ప్రకటించడం (2:22–40)

పెంతెకొస్తు సంఘటనను గురించి కొంత వివరణ యిచ్చిన తరువాత, 22వ వచనం నుండి పేతురు తన ప్రసంగాన్ని ఆరంభిస్తున్నాడు. తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ "ఇశ్రాయేలువారలారా, యీ మాటలు వినుడి" అని అంటున్నాడు. క్లుప్త ఉపోద్ఘాతం తరువాత పేతురు నోటినుండి వచ్చిన మొదటి మాట "నజరేయుడగు యేసు."

పేతురు ప్రసంగం యొక్క సూచిక చాలా సులభమైనది. అతడు యేసును గురించి చెప్తూ, "అద్భుతములను, మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్యను చేయించి ..." (22 వచనం) అని వివరిస్తున్నాడు. దీనిని తన శ్రోతలు కాదనలేరు. తరువాత ఆయన అన్యాయముగా చంపివేయబడ్డాడని, ఈ విషయంలో మీరే అపరాధులు అని తన శ్రోతలను నిందిస్తున్నాడు. "... యీయనను మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి" (23 వచనం). నిజానికి ఈ పనిచేసింది రోమా సైనికులు అయినను, యూదుల గుంపు ఇంకా చెప్పాలంటే, యూదా మత నాయకుల బలవంతము చేతనే ఇది జరిగింది. ఇదంతా జరుగుటకు దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును ఇందులో ఉన్నాయని పేతురు ప్రకటిస్తున్నాడు. యేసుని మరణం ఒక దురదృష్టకరమైన సంఘటన అని పేతురు బోధించుట లేదు గాని, ఇదంతయు – ఆదికాండము 3:15 మొదలుకొని, మెస్సీయ వస్తాడన్న వాగ్దానం వరకు చెప్పబడిన వాగ్దానములన్నిటి నెరవేర్పుగా బోధిస్తున్నాడు. పాత నిబంధనకు కొనసాగింపుగా క్రొత్త నిబంధన యేసు రాక వరకు కొనసాగింపబడిందని ఇదంతా దేవుని ప్రణాళిక అని బోధిస్తున్నాడు.

పేతురు యొక్క తరువాత అంశం ప్రాముఖ్యమైనది, తనకు ఇయ్యబడిన స్థలమునకు అది తగు న్యాయమును జరిగిస్తుంది. యేసు సిలువవేయబడి మరణించిన తరువాత పునరుత్థానుడయ్యాడు (24–35 వచనాలు). పునరుత్థానం అవశ్యకమని తెలియజేయుటకు పేతురు కీర్తనల గ్రంథం నుండి రెండు వాక్యభాగములను ఉదహరిస్తున్నాడు. మొదటిగా, 25 నుండి 28 వచనాల వరకు కీర్తనలు 16:8–11 ఉదహరించబడింది. ఇందులోని ముఖ్య వచనం ఇదే, "నీవు నా ఆత్మను పాతాళములో విడిచిపెట్టవు. నీ పరిశుద్ధుని కుళ్లుపట్ట నియ్యవు" (27 వచనం). ఈ వచనములను ఉదహరిస్తూ, దావీదు తను గురించి తాను ఈ మాటను చెప్పుటలేదని, ఎందుకంటే, అతని దేహం ఇప్పటికే సమాధిలోనే పాతిపెట్టబడి ఉందని వివరిస్తున్నాడు. (ఆ సమాధి పేతురు కాలంనాటికి వారి మధ్యనే ఉంది. ఆ సమాధిగా ఇప్పుడు అనేకమంది దర్శిసున్న సమాధి నిజమైనదో కాదో తెలియదు.) దావీదు కేవలం గొఱ్ఱెల కాపరి లేదా రాజు మాత్రమే కాదు గాని, క్రీస్తు (మెస్సీయ) పునరుత్థానమును ప్రవచించిన ప్రవక్త అని పేతురు ప్రసంగిస్తున్నాడు. "క్రీస్తు పాతళములో విడువబడలేదనియు, ఆయన శరీరము కుళ్లిపోలేదనియు చెప్పెను" (అపొస్తలుల కార్యములు 2:31). తరువాతదిగా, పునరుత్థానుడైన మెస్సీయ దేవుని కుడిపార్శ్వమున హెచ్చింపబడుటను గురించి పేతురు ప్రసంగిస్తున్నాడు. దీనినే చెప్తూ కీర్తన 110:1 వాక్యమును ఉదహరిస్తున్నాడు (ఇది ఆది క్రైస్తవులకు ఇష్టమైన ప్రమాణ

వాక్య భాగం; చూడు మత్తయి 22:44; మార్కు 12:36; లూకా 20:42, 43; హెబ్రీయులకు 1:13). "ప్రభువు" అని పిలువదగిన వానితో చెప్పున్నట్లుగా దావీదు "ప్రభువు" (దేవుడు) అన్న మాటను ఉపయోగించాడు. "నేను నీ శత్రువులను నీ పాదములక్రింద పాదపీఠముగా ఉంచువరకు నీవు నా కుడిపార్శ్వమున కూర్చుండుమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను" (అపొస్తలుల కార్యములు 2:34, 35). ఇది పేతురు ప్రసంగం ముగింపునకు నడి పించింది: "మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను" (36 వచనం). సిలువ వేయబడిన యేసు "ప్రభువు" మరియు "మెస్సీయ" అని పిలువబడుటకు తగినవాడు. ఇశ్రాయేలు, పునరుద్ధరణ మరియు రక్షనకు ఉన్న నిరీక్షణ యొక్క నెరవేర్పు ఆయనే – కానీ ఆయన సొంత జనులే ఆయన్ను సిలువవేశారు.

ఇదే పేతురు ప్రసంగమునకు అతడు అనుకున్న ముగింపా లేక అతని శ్రోతలు అతని ప్రసంగమునకు అడ్డుపడ్డారా? అన్నది అస్పష్టం. అతని మాటలు ఎంతో ప్రభావాన్ని చూపాయి. వారు, "హృదయములో నొచ్చుకొని" అని 37వ వచనం తెలియజేస్తుంది. అంటే, వారు ఎంతగానో నొప్పింపబడి, తీవ్రమైన బాధతో ఒప్పుకోలుకు గురయినారు. దీన్నిబట్టి వారు "మేమేమి చేతుము?" అని అడిగారు. అంటే, ఇంతటి తీవ్రమైన పాపమునకు పాపక్షమాపణ ఎలా పొందుకొనగలం అన్నది వారి ఉద్దేశం కావచ్చు. ఇందుకు పేతురు స్పష్టమైన సమాధానాన్ని ఇచ్చాడు, "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (38 వచనం). వారి ప్రశ్న ఎంతో ప్రాముఖ్యమైనది. పేతురు సమాధానం కూడ స్పష్టంగా ఉంది. మనం కూడా ఈ ప్రశ్నను అడిగి, దీని సమాధానమునకు బాగా చెవియొగ్గియుండాలి.

"మారుమనస్సు" పొందడం అంటే, అక్షరార్థముగా తిరగడం, అంటే పాపమునుండి తిరిగి దేవునివైపు తిరగడం. దేవున్ని గురించి అజ్ఞానంగా జీవించడమును పాపులు విడిచిపెట్టి ఆయన వైపు తిరిగి, ఆయన మననుండి ఏం కోరుకుంటున్నాడో దాని ప్రకారం జీవించాలి. మారుమనస్సు అనేది కేవలం మనస్సులో జరిగేది మాత్రమే కాదు గానీ, అందుకు అను గుణంగా కార్యం చేయుటకు ప్రేరేపించే నిర్ణయం. "... బాప్తిస్మము పొందుడి" అని పేతురు అంటున్నాడు, బాప్తిస్మం అనేది ఒక అవకాశం కాదు. ఇది అవసరత. ఇది మనకు ఆశ్చర్యకరంగా అన్పించకూడదు. ఎందుకంటే, బాప్తిస్మం యొక్క ఉద్దేశమును అతడు వివరిస్తున్నాడు "పాప క్షమాపణ నిమిత్తము ..." అదీకూడా "యేసు క్రీస్తు నామములోనే" పొందాలి. అంటే, ఇది ఆయన అధికారముతో జరుగుతుంది. ఆయన అందించు రక్షణ మీదనే ఆధారపడియుంది.

ఈ ఆజ్ఞతోపాటు ఒక వాగ్దానం ఉంది: "... అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు." పరిశుద్ధాత్మ అను వరమును పరిశుద్ధాత్ముడు ఇవ్వడు, గానీ, పరిశుద్ధాత్ముడే మనకు వరము (చూడు అపొస్తలుల కార్యములు 5:32; 8:14–16; లూకా 11:10–13). ఇది యోవేలు యొక్క వాగ్దానమునకు సంబంధించియుంది. ఆత్మ కుమ్మరింపు అందరి మీదను రావడమును గురించి చెప్తూ పేతురు దీనినే ఉదహరించాడు. ఇప్పుడు ఆ ఆత్మ వరము అందరికీ అందుబాటులో ఉంది. మారుమనస్సు పొంది, బాప్తిస్మంపొందుట ద్వారా

ప్రతి ఒక్కరు ఆత్మకు అందుబాటులో ఉండాలి. అప్పుడు పెంతెకొస్తు దినాన అక్కడున్న వారికి మాత్రమే ఈ వాగ్దానం అందుబాటులో లేదని, వారికే గాక, భవిష్యత్ యూదుల విశ్వాసులకు అలాగే "దూరస్థులందరికీ" (అనగా, అన్యులు) ఈ వాగ్దానం అందుబాటులో ఉంది అని 39వ వచనంలో చెప్పబడింది. మరో మాటలో చెప్పాలంటే, ఈ వాగ్దానం నుండి ఎవరూ మినహాయించబడలేదు. అలాగే పేతురు ద్వారా దేవుడిచ్చిన ఆజ్ఞకు లోబడకుండా ఎవరూ తప్పించుకొనలేరు.

"ఇంకను అనేకవిధములైన మాటలతో సాక్ష్యమిచ్చి ... వారిని హెచ్చరించెను" (40ఎ వచనం) అని లూకా సంక్షిప్తీకరిస్తున్నాడు. దీన్నిబట్టి పేతురు ఏం చెప్పియుంటాడో మనం ఊహించవచ్చు. అపొస్తలుల కార్యముల గ్రంథంలోని మిగతా అన్ని సందేశములవలనే ఇది కూడ పూర్తి, సరియైన సంపూర్ణ సందేశ పాఠం కాదు గాని, ఇది కేవలం దాని సారం మాత్రమే. "ఇంకను అనేకవిధములైన మాటలు" అంటే, ఏ విధంగా రక్షించబడాలని మాత్రమే పేతురు సమాచారం ఇవ్వలేదు గాని, ఈ రక్షణకు తమ్మును తాము అందుబాటులోనుంచుకోవాలని వారిని హెచ్చరిక చేస్తున్నాడు. "మీరు మూర్ఖులగు ఈ తరమువారికి వేరై రక్షణపొందుడని" వారిని హెచ్చరిస్తున్నాడు (40బి వచనం). సువార్తను విన్న వారందరు రాబోవు దేవుని ఉగ్రతను తప్పించుకునే అవకాశం పొందారు. అలాగే రక్షణ ద్వారా కలిగే ఆశీర్వాదాలను పొందగలిగారు. ఈ అవకాశం ఈనాటికీ ఉంది.

యేసుని గురించి పేతురు చేసిన సువార్త ప్రకటన క్లుప్తంగా, సూటిగా ఉంది. అయితే "మారుమనస్సు పొంది, బాప్తిస్మము పొందుడి" అన్న ఈ ప్రకటన కొన్నిసార్లు వక్రీకరించబడింది మరి కొన్నిసార్లు పూర్తిగా మరుగున పడిపోతుంది. యేసుని గురించిన సువార్త ప్రకటనతోపాటు, ఆయన్ను ఎలా పొందుకోవాలి అన్న విషయాన్ని కూడా ప్రకటించాలి. లేకపోతే, చెప్పబడిన సందేశమునకు పశ్చాత్తాపపడినా రక్షణను ఎలా పొందుకోవాలో అర్థంకాని పరిస్థితిలో శ్రోతలు ఉంటారు. పేతురు సొంత మాటలు గాక ఏవిధంగా చెబితే ప్రజలు సువార్తకు ప్రతిస్పందిస్తారు? యేసును కలిగియుండుటకు ప్రార్థించమని ప్రజలను అడిగేకంటే (రక్షణపొందడానికి యిలా ఎవరూ చేసినట్లు అపొస్తలుల కార్యములలో వ్రాయబడలేదు), పెంతెకొస్తు దినాన ప్రత్యక్ష పర్చబడిన సంపూర్ణ సువార్త సందేశములను మనం ప్రకటించాలి. సిలువ వేయబడి, పునరుత్థానుడైన యేసుని గురించిన సువార్త అపొస్తలుల సందేశం ఈనాటికీ చెల్లుతున్నట్లయితే, "మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుడి" అన్న అపొస్తలుల ఆజ్ఞకూడ ఈనాటికీ చెల్లుతుంది.

### సువార్త ప్రకటన ఫలితం: సంఘ ఆవిర్భావం (2:41-47)

పేతురు సందేశమునకు ప్రతిఫలముగా మూడు వేలమంది ప్రతిస్పందించారని ఒక గొప్ప సత్యమును 41వ వచనం తెలియజేస్తుంది. ఆయన వాక్యమును "అంగీకరించుట" ద్వారా ఇంతమంది ప్రజలు బాప్తిస్మం పొందారు. ఈ వచనంలో "సంఘం" అనేమాట ఉపయోగించబడక పోయినను (2వ అధ్యాయంలో మరెక్కడా కనబడకపోయినా, KJV అనువాదము దీన్ని చేర్చినా), బాప్తిస్మం పొందిన వీరు సంఘం ఆవిర్భావమునకు కారణమయ్యారు. ఈ బాప్తిస్మం పొందిన వారు "సంఘం" అని పిలువబడ్డాడు (అపొస్తలుల కార్యములు 8:1; చూడు 5:11). నూతనంగా ఏర్పడిన ఈ యేసు అనుచరులు యిలా

పిలువబడ్డారు. లేఖనాలలో వారు "విశ్వాసులు" (5:14; చూడు 4:32) అని, "శిష్యులు" (6:1; 9:26) అని మరియు, "మార్గము" (9:2) అని "క్రైస్తవులు" (11:26) పిలువబడ్డారు.

సువార్త సందేశం ద్వారా దానికి లోబడిన వారి ద్వారా సంఘం ఏర్పడుతుంది. నిజానికి క్రొత్త నిబంధన భావములో చెప్పాలంటే, సువార్తను విన్నవారు, నమ్మినవారు, దానికి విధేయులైనవారు సంఘము, విధేయులైన, ఆరాధించు విశ్వాసుల గుంపు గురించి తరువాత వచనమైన 42వ వచనంలో వివరించబడింది. "వీరు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టెవిరుచుటయందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి." "రొట్టెవిరుచుట" అంటే ప్రభువు బల్లారాధన "ప్రార్థనలు" (ESV) అనేవి వ్యక్తిగతమైనవి గాక సంఘపరంగా చేసే ప్రార్థనలు. 43 నుండి 46 వచనాలలో విశ్వాసులు అధిక సంఖ్యలోనున్నను, వీరు ఎంతటి సహవాసం కలిగియున్నారంటే, వీరు దాతృత్వం ద్వారా అందరి అవసరతలను తీర్చుకునేవారు. ఆదిమ సంఘం ఏర్పరచిన విధానం ఎంతటి అద్భుతమైనదంటే ఈనాడు సంఘం దీనిననుసరించుటకు ప్రయత్నిస్తుంది. ఈ విధానం అంతా ప్రతిరోజు జరిగేదని తద్వారా రోజూ కొంతమంది సంఘములో చేర్చబడేవారని 47వ వచనం తెలియజేస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, పెంతెకొస్తు దినాన జరిగిన సువార్త సంఘటనలు ఆ ఒక్కరోజుకే పరిమితం కాలేదు గాని, ఈనాటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

సంఘం గురించి సవిస్తారముగా చెప్పుటకు ఇక్కడ ఖాళీ సరిపోదు. ఏదేమైనా, సంఘం గురించిన కొన్ని తప్పుడు అభిప్రాయములను ఈ అధ్యాయం తొలిగిస్తుంది.

మొదటిగా, క్రైస్తవ విశ్వాసములో సంఘం అనేది కేవలం ఒక ఆప్షన్ అని కొంతమంది భావిస్తుండగా, ఇది క్రైస్తవ విశ్వాసమునకు ఒక అవకాశంగా చేర్చబడినదికాదని 2వ అధ్యాయంలోని క్రైస్తవ విశ్వాసం మరియు సంఘం మధ్యనున్న సంబంధం తెలియజేస్తుంది. రక్షించబడడం అంటే సంఘములో చేర్చబడడం అని క్రొత్త నిబంధనలో పలు చోట్ల మనకు కనబడుతుంది. సంఘం మాత్రమే అందించే సహవాసం, బోధన మరియు ప్రోత్సాహము అవసరం లేకుండా విశ్వాసి ఒంటరిగానుండడం అన్నది మంచి విధానం కాదు.

రెండవదిగా, సంఘం అనేది వారసత్వ నాయకత్వం కాదు. అపొస్తలుల కార్యములు 2లో అటువంటి విధానం లేదు గాని, ఇంకనూ సంఘం ఉనికిలో ఉంది. సంఘం నమ్ముతున్న వాటిని, చేస్తున్నవాటిని, సంఘ నాయకులు వారసత్వంగా నిర్ణయించినవే అని చెప్పడం మనం వింటూనే ఉంటున్నాము. కానీ ఇది క్రొత్త నిబంధన విధానం కాదు.

మూడవదిగా, సంఘం అనేది మానవుల చేతను వ్యవస్థాపించబడినది కాదు అలాగే మానవ కల్పిత విధులు ఇందులో లేవు. యేసుని గురించిన సువార్త ప్రకటించబడడం ద్వారా, దానిని నమ్మి ప్రజలు లోబడడంవలన వారు దేవుని చేత విమోచింపబడిన సంఘమే క్రొత్త నిబంధన సంఘం. ఇది మానవ నిర్ణయంతో ప్రారంభమైందికాదు గాని దేవుడు ఏర్పరిచినది.

చివరిగా, సంఘం ప్రజలను రక్షించదు. రక్షించబడిన వారు సంఘంలో "చేర్చబడ్డారు" అని 41 నుండి 47 వచనాలు తెలియజేస్తున్నాయి. కాబట్టి రక్షించబడినవారు సంఘంలో ఉంటారు కానీ, సంఘంలో ఉన్నందుకు ప్రజలు రక్షించబడరు. రక్షణకు మూలం – సువార్త, ఫలితం సంఘం. మనము ఈ వ్యత్యాసాన్ని గ్రహించి రక్షణ అనేది దైవికం గాక మానవీయమైనదని భావించకూడదు.

**ముగింపు**

పెంతెకొస్తు దినం ఒక నూతన శకమునకు నాంది పలికింది. అది మెస్సీయ శకమైన "అంత్య దినములు." క్రీస్తు మరలా తిరిగి వచ్చేంతవరకు. తన ప్రజల పట్ల దేవుని చిత్తం సమాప్తి అగువరకు క్రైస్తవులు "అంత్య దినములలోనే" (హెబ్రీయులకు 1:2) జీవించాలి. యేసు మెస్సీయా చేత విడిపించబడిన విశ్వాసులు, దేవుని ఆత్మ చేత బలపరచబడి, ఆయన సంఘముగా చేర్చబడి నూతన ఇశ్రాయేలుగా (గలతీయులకు 6:15, 16) జీవించగలిగే అవకాశం మనకు ఇప్పుడు ఉంది.

---

సూచన

[1]దేవుని సన్నిధిని వివరించుటకు గాలి మరియు అగ్ని పాత నిబంధనలో ఉపయోగించబడ్డాయి (చూడు నిర్గమకాండము 19:18; 1 రాజులు 19:11, 12; హోషేయ 13:15).

---

## అపొస్తలుల కార్యములు 2 మరియు మిగతా చోట్ల "భాషలు మాట్లాడడం"

పెంతెకొస్తు దినమున మాట్లాడిన "అన్యభాషలు" దాని స్వభావమును గురించి చర్చించుటకు అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయం సరైన లేఖన భాగము. అపొస్తలుల కార్యములలో తరువాతి భాగములో అలాగే 1 కొరింథీయులకు 12–14లో చెప్పబడిన దృష్టాంతము ఇదేనా కాదా అన్నదే ప్రశ్న.

*"Glossa"* అను గ్రీకు పదమునకు "భాష" అని అర్థము. ఇంగ్లీషు భాషలో వలెనే (tongue) దీనిని మాట అని చెప్పవచ్చు లేదా ఇది ఒక భాషను సూచిస్తుందని చెప్పవచ్చు.

అపొస్తలులు తాము మాట్లాడిన మాటలు లేదా భాష అప్పటికి వాడుకలోనున్న భాషే గాని అది వారికి క్రొత్త భాష అని అపొస్తలుల కార్యములు 2 స్పష్టం చేస్తుంది. సంఘటనను వివరిస్తూ లూకా (*dialektos*; 6 వచనం) మరో పదమును వాడుతున్నాడు, దీనినుండి మనకు సంభాషణ "dialect" అనే పదం వచ్చింది. ఇది ఒక భాషను సూచిస్తుంది. పండుగ సందర్భముగా అక్కడకు వచ్చిన విభిన్న జాతులవారికి వివరిస్తూ 8వ వచనంలో మరోసారి ఇది వాడబడింది. అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయములో, *glossa* మరియు *dialektos* అనే పదములు ఒకదాని తరువాత ఒకటి వాడబడ్డాయి. అంటే, "భాషలు" అనేది అపొస్తలులు అద్భుతంగా మాట్లాడిన వాడుకలోనున్న భాషలు.

అయితే, క్రొత్త నిబంధనలో మిగతా చోట్ల వాడబడిన "భాషలు" సంగతి ఏంటి? అపొస్తలుల కార్యములలో మరో రెండు చోట్ల మాత్రమే దీని ప్రస్తావముంది (10:46లోని కొర్నేలీ మరియు అతని కుటుంబం; 19:6లోని పన్నెండుమంది ఎఫెసీ శిష్యులు). అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయంలోని సన్నివేశంవలెనే ఇవి ఏవీ లేవు. అయితే ఈ వాక్యభాగాలలో భాషల స్వరూపం ఎందుకు మారిపోయిందనడానికి తగుకారణం మనకు కనబడదు. వాక్యమును వ్యాఖ్యానించుటలోనున్న ఒక నియమం ఏంటంటే, స్పష్టంగానున్న వాక్యం (ఇక్కడ, అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయం) అస్పష్టతగానున్న వాక్యమును (అపొస్తలుల కార్యములు 10; 19) వ్యాఖ్యానించవలెను.

భాషల గురించి వివరిస్తున్న మరో క్రొత్త నిబంధన వాక్య భాగం 1 కొరింథీయులకు 12-14. కొరింథీ సంఘంలో మాట్లాడిన "భాషలు" ఆనంద పరవశంతో ఉచ్చరించిన అర్థరహిత పదాలుగా చెప్పబడుతున్నాయి. కాని యిలా అని ఈ మూడు అధ్యాయములలో ఎక్కడా చెప్పబడలేదు. కాబట్టి స్పష్టత వాక్యం అస్పష్టత వాక్యమును వ్యాఖ్యానించాలి. ఇంకా ముందుకు వెళ్ళితే, 1 కొరింథీయులకు 14:9-11లోని "భాషలు" (tongues) "భాష" (language) అను పదమునకు సంబంధించియున్నాయి. దీన్నిబట్టి కొరింథీయుల భాషలు మానవుల భాషలే. అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయంలో వలెనే ఇది కూడా పర భాషలే.

అయితే భాషలలో మాట్లాడడం అనేది రక్షణకు అగత్యత అని లేదా ఒక గురుతు అని ఏ వాక్య భాగం చెప్పడం లేదు.

---

## అపొస్తలుల కార్యములోని "బాప్తిస్మం" మరియు "పరిశుద్ధాత్మ"

మారుమనస్సు పొంది బాప్తిస్మం పొందే సమయంలో పరిశుద్ధాత్ముని కుమ్మరింపు చోటు చేసుకుంటుందని 2:38 చాలా స్పష్టంగా చెప్తుంది. కానీ అపొస్తలుల కార్యములలో పరిశుద్ధాత్మ వరం అనేది బాప్తిస్మమునకు ముందు లేదా అసలు బాప్తిస్మం ఉన్నను ఆ పదం యొక్క ఆనవాలే కనబడకుండా ఉంది.

ఉదాహరణకు, అపొస్తలుల కార్యములు 10లో పేతురు తనకు కలిగిన దర్శన ఫలితంగా రోమా శతాధిపతియైన కొర్నేలీ ఇంటికి వెళ్ళినట్లు చూస్తున్నాం. అక్కడ కొర్నేలీ కుటుంబమునకు, స్నేహితులకు యేసుని గురించి పేతురు ప్రకటించాడు. 44 నుండి 46 వచనాలలో, "పేతురు ఈ మాటలు ఇంక చెప్పుచుండగా అతని బోధ విన్న వారందరిమీదికి పరిశుద్ధాత్మ దిగెను. సున్నతి పొందినవారిలో పేతురుతోకూడ వచ్చిన విశ్వాసులందరు, పరిశుద్ధాత్మ వరము అన్యజనులమీద సయితము కుమ్మరింపబడుట చూచి విభ్రాంతినొందిరి. ఏలయనగా వారు భాషలతో మాటలాడుచు దేవుని ఘనపరుచుచుండగా వినిరి." అప్పుడు వారందరూ బాప్తిస్మం పొందారు. అపొస్తలుల కార్యములు 2:38లో బాప్తిస్మం తరువాత పరిశుద్ధాత్మ ఎవరకు ఇయ్యబడుతుందని చెప్పబడగా, ఇక్కడ సంఘటనల క్రమం 2:38కి భిన్నంగా ఉన్నది, ఎందుకు? ఇందులో సంఘటనల పరిస్థితులలోనే దీని సమాధానం ఉంది. మొట్టమొదటిసారిగా ప్రభుని అపొస్తలులలో ఒకరు అన్యులకు సువార్తను ప్రకటించాడు. దీనిని ఆది క్రైస్తవులెవ్వరూ ఊహించనిది. అన్యులకు సువార్త ప్రకటించి బాప్తిస్మమిచ్చినందుకు పేతురు తరువాత యెరూషలేములో వివరణ ఇవ్వవలసి వచ్చింది (అపొస్తలుల కార్యములు 11:1-18). అన్యుల మీద పరిశుద్ధాత్మ కుమ్మరింపబడి, భాషలతో మాట్లాడడము అనేది "అన్యుల పెంతెకొస్తును" సూచిస్తుంది. అన్యులు కూడ దేవునికి అంగీకారయోగ్యమేనన్న సత్యమును యూద క్రైస్తవులు గుర్తించునట్లు ఇది జరిగింది (10:34, 35; చూడు పేతురు వివరణ 10:47 మరియు 11:17).

అలాగే, అపొస్తలుల కార్యములు 8:14-17లో పరిశుద్ధాత్మ, బాప్తిస్మం సమయంలో లేదా దాని ముందు గాని గాకుండా, కొంత కాలం తరువాత, అపొస్తలులు చేతులుంచడం ద్వారా పరిశుద్ధాత్మ వచ్చినట్లు చూస్తున్నాం. మరలా 2:38లోని విధానమునకు భిన్నంగా మరో పరిస్థితి ఎదురయ్యింది. ఈ విధానంలో బాప్తిస్మం పొందింది సమరయులు, వీరు సగం

యూదులు. యూదుల చేత వీరు ఎంతో ద్వేషించబడేవారు, అన్యులకంటె కూడా ఎక్కువగా వీరిని చూసేవారు. సమరయులు క్రీస్తు నొద్దకు తిరిగితే, వారుకూడ దేవునికి అంగీకార యోగ్యమేనని యూద క్రైస్తవులను ఒప్పించడం కోసం దేవుని నుండి (అపొస్తలుల ద్వారా) ఆమోదము అవసరము. అపొస్తలులు చేతులుంచడం ద్వారా పరిశుద్ధాత్మ కుమ్మరింపు ద్వారా దేవుని ఆమోదం తెలుపబడింది.

నీటి బాప్తిస్మం మరియు పరిశుద్ధాత్మ ఆవరింపుల మధ్యనున్న సంబంధమును గురించి క్రొత్త నిబంధనలో యోహాను 3:5 మరియు తీతు 3:5 చూడండి